## క్లుప్తంగా

### శ్రేయా మిశ్రోకు జ్యూరీ అవార్డు




శ్రేయా మిశ్రోకు అవార్డు, మెమెంటో అందజేస్తున్న సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ రాజు

పాతపట్నం: విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ అంబేడ్కర్ అసెంబ్లీ హాల్‌లో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు ఏయూ సంగీత నృత్య విభాగం, నాట్య రవళి మ్యూజికల్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో అఖిల భారత సంగీత నృత్య ప్రదర్శన నిర్వహించారు. పాతపట్నం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన శ్రేయా మిశ్రో జ్యూరీ అవార్డు దక్కింది. భరతనాట్యం, కూచిపూడి, జానపదం, ఒడిస్సీ తదితర విభాగాల్లో నిర్వహించిన పోటీలకు ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన నృత్య కళాకారులు పాల్గొన్నారు. కూచిపూడిలో శ్రేయామిశ్రో చేసిన నృత్య ప్రదర్శనకు (ప్లేట్ డాన్స్) అవార్డు దక్కింది. సెంచూరియన్ యూనివర్సిటీ ఉపకులపతి బి.ఎస్.ఎన్.రాజు, ఆంధ్రా యూనివర్సిటీ సంగీత నృత్య విభాగం అధిపతి ప్రొఫెసర్ అనూరాధ, ప్రొఫెసర్స్ సులేమన్, మహమ్మద్ ఖాన్, నాట్య రవళి వ్యవస్థాపకుడు మహేష్ బాబు, నటరాజ్ పరమేశ్వరన్, విజయవాణి తదితరులు పాల్గొన్నారు.

### హుండీ ఆదాయం రూ.60,460



హుండీ తెరుస్తున్న కమిటీ సభ్యులు

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణ గ్రామ దేవత పాలపోలమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో రెండు హుండీల ఆదాయం రూ. 60,460 వచ్చినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కూన బాలకృష్ణ ఆదివారం తెలిపారు. గత సోమవారం ఆలయంలోని నాలుగు హుండీలు తెరిచామన్నారు. ఈ రెండు హుండీల తాళాలు ఆ సమయంలో తెరుకుకోకపోవడంతో.. వాటిని ఆదివారం సభ్యుల సమక్షంలో తెరిచి లెక్కించామన్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ కార్యవర్గ సభ్యులు జె.కె.వెంకుబాబు, బలివాడ రాజేష్‌శర్మ, గుండ్ల బాబు, శిల్లా మల్లికార్జునరావు, కుసుమంచి శ్యామ్‌ప్రసాద్, పైడి అయ్యప్ప, కూన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### మండలానికి 35 వేల చెత్త సేకరణ బుట్టలు



చెత్తసేకరణ బుట్టలను అన్‌లోడ్ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

నరసన్నపేట: మండలంలో చెత్త సేకరణకు వీలుగా ఇంటింటికీ సరఫరా చేసేందుకు 35 వేల చెత్త బుట్టలు వచ్చాయని ఎంపీడీఓ బి.మధుసూదనరావు ఆదివారం తెలిపారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరణకు వీలుగా వీటిని ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. పంచాయతీల వారిగా ఇంటింటికీ పంపిణీ చేస్తామన్నారు. మండల పరిషత్ వద్ద వీటిని భద్రపరిచామన్నారు.

### శరవేగంగా ఫ్లైఓవర్ పనులు



నీలమణిదుర్గ అలయం ముందు ఫ్లైఓవర్, అండర్ పాసేజ్ పనులు చేపడుతున్న దృశ్యం

పాతపట్నం: మండల కేంద్రంలోని నీలమణి దుర్గ అమ్మవారి ఆలయం కూడలిలో హైవే ఫ్లైఓవర్, అండర్ పాసేజ్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. టెక్కలి రోడ్డు నుంచి వచ్చే వాహనాలు రాకపోకలకు ఫ్లైఓవర్ కింద పాస్‌జేను ఏర్పాటు చేస్తున్నామని హైవే అధికారులు తెలిపారు. పాతపట్నం నుంచి నేరుగా టెక్కలి, కొరసవాడ నుంచి టెక్కలి వైపు వెళ్లడానికి అండర్ పాసేజ్ ఉపయోగపడుతుందన్నారు. జాతీయ రహదారి పనుల్లో భాగంగా ఫ్లైఓవర్ పనులు చేస్తున్నామని, అందులో భాగంగా పెంట్రోల్ బంక్ వద్ద పనులు ప్రారంభించామని తెలిపారు.

### కేజీబీవీ ఎస్‌ఓగా సంతోషి



కర్ర సంతోషి

సారవకోట: సారవకోట కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఎస్‌ఓగా కర్ర సంతోషి నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన ఎస్‌ఓ శిరీష కొన్ని నెలల క్రితం బదిలీపై వెళ్లారు. ఇటీవల ప్రభుత్వం పోస్టులు భర్తీ చేయడంతో సంతోషి ఇక్కడ నియమితులయ్యారు. ఈమె గతంలో ఇదే పాఠశాలలో సీఆర్టీగా పనిచేశారు.

## ● రక్తదానం.. ప్రాణదానం



రక్తదాతలే ప్రాణదాతలని సత్యసాయి బాల వికాస్ జిల్లా ఇన్‌చార్జి, జోనల్ కార్యదర్శి, సత్యసాయి ఆనంద నిలయం కన్వీనర్, బూర్జ ఎంపీపీ కర్నేన దీప అన్నారు. బూర్జ మండలంలోని ఉప్పినివలసలోని సత్యసాయి ఆనందనిలయం, లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 21 మంది యువకులు రక్తదానం చేశారు. గ్రామంలో మొక్కలు నాటారు. అనంతరం నారాయణ సేవ ఏర్పాటు చేశారు. రిమ్స్ డాక్టర్లు, లైన్స్‌క్లబ్ ప్రతినిధులు, ఉప సర్పంచ్ కరణం అనిల్ నాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు. – బూర్జ

## ● వర్షాలు కురవాలని..



వర్షాలు అనుకున్న స్థాయిలో కురవకపోవడంతో వరినార్లు పూర్తిగా ఎండిపోతున్నాయి. వర్షాలు కురవాలని కోరుతూ సరుబుజ్జిలి మండలంలోని పురుషోత్తపురం ఉమాకామేశ్వర స్వామివారికి గ్రామస్తులు, భక్తులు ఆదివారం సహస్ర ఘటాభిషేకం చేశారు. సమీపంలోని వంశధార నది నుంచి ఘటాలతో జలాన్ని తెచ్చి శివలింగం మునిగేవరకు అభిషేకించారు. ఆలయ అర్చకులు పాల్గొన్నారు. – సరుబుజ్జిలి

## ● విత్తన శుద్ధిపై అవగాహన



బీజామృతంతో విత్తన శుద్ధి చేయడం ద్వారా పంటకు ఎంతో మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయం కొత్తూరు సబ్ డివిజన్ యాంకర్ బాబాజీ అన్నారు. కొత్తూరు మండలంలోని వసపలో వరి విత్తనాలను బీజామృతంతో విత్తన శుద్ధి చేయించారు. బీజామృతం తయారుచేసే విధానం, విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కల్పించారు. ఎంటీ ఎస్.సూర్యనారాయణ, ఏఎంటీ సంజీవ్, మహిళా రైతులు, మహిళా సంఘాల సభ్యులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు. – కొత్తూరు

# రైతు చెంతకే సేవలు



సత్యవరం ఆర్‌బీకేలో విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

- ఊరూరా రైతు భరోసా కేంద్రాలు
- స్థానికంగానే అన్ని రకాల సేవలు
- రైతులకు తప్పిన వ్యయప్రయాసలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



బొరిగివలస ఆర్‌బీకే కేంద్రం

నరసన్నపేట: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయం దండగ అనే రోజులు నుంచి.. ప్రస్తుత ప్రభుత్వంలో వ్యవసాయం పండగలా చేసుకునే రోజులు వచ్చాయి. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి ఇంటి ముంగటకే అన్ని రకాల సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. గతంలో విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు పొందాలంటే అదో ప్రహసనం. రోజుల తరబడి పట్టణాలు, మండల కేంద్రాల వద్ద బారులు తీరి.. అన్ని పనులు మానుకొని అక్కడే ఉండాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆర్‌బీకేలకు వెళ్లి తమ అవసరాలు చెబితేచాలు పనులు వెంటనే జరుగుతున్నాయి. భూసార పరీక్షల నుంచి పంట ఉత్పత్తులను విక్రయించుకునేంత వరకు రైతన్నలకు ఈ ప్రభుత్వం వెన్నంటే నిలుస్తోంది. రైతుల అవసరాలు తీర్చుతూ పంటల సాగులో సలహాలతో పాటు ప్రభుత్వ పథకాలపై ఆర్‌బీకే సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగల మందులు, యంత్ర పరికరాలు, ఆధునిక వ్యవసాయ సమాచారం, మార్కెటింగ్ ధరలు తదితర సేవలు పల్లెల్లోనే అందుతున్నాయి.

| నరసన్నపేట మండలంలోని రైతుల వివరాలు | |
|---|---|
| కౌలు రైతులు | 1890 |
| కౌలుదారు హక్కు కార్డులు పొందినవారు | 285 |
| మొత్తం రైతులు | 14,600 |
| రైతు కుటుంబాలు | 9100 |
| రైతు భరోసా పొందుతున్న రైతులు | 8864 |
| సాగు విస్తీర్ణం | 18 వేల ఎకరాలు |
| ఆర్‌బీకేలు | 24 |
| పక్కా భవనాలు ఉన్న ఆర్‌బీకేలు | 12 |
| నిర్మాణంలో ఉన్న ఆర్‌బీకేలు | 12 |

### ఆనాటి కష్టాలు వర్ణించలేనివి



గ్రామాల్లో ఆర్‌బీకేలు ఏర్పాటు కావడంతో బాగా ప్రయోజనం పొందుతున్నాం. గతంలో నానా అవస్థలు పడేవారం. విత్తనాలు కావాలన్నా, ఎరువులు కావాలన్నా సమీపంలోని నరసన్నపేటకు వెళ్లాల్సివచ్చేది. విత్తనాల కావాలంటే గంటల తరబడి క్యూలో ఉండాల్సి వచ్చేది. ఎరువులు అధిక ధరలకు కొనుగోలు చేసేవారం. ప్రస్తుతం గ్రామంలోనే ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వ నిర్ణయించిన ధరలకే ఎరువులు అందుతున్నాయి. కట్టె జనుము, జీలుగు విత్తనాలు కూడా ఇక్కడే లభిస్తున్నాయి.

– వెలమల వెంకటరమణ, రైతు, జమ్ము

### ఆర్‌బీకేల ఏర్పాటుతో ఎంతో మేలు



సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తరువాత రైతులకు మేలు జరుగుతోంది. గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడంతో అన్ని సదుపాయాలు ఇక్కడే పొందుతున్నాం. గత ప్రభుత్వ కాలంలో అయితే ప్రతీ దానికీ అనేక కష్టాలు పడేవారం. విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేవి కావు. ఇప్పుడు అన్నీ ముందుగానే అందుతున్నాయి. పంటలకు అనువుగా ఎరువులు వేస్తున్నాం. మంచి దగుబడులు వస్తున్నాయి. వ్యవసాయ శాఖ సిబ్బంది సూచనలు, సలహాలు సకాలంలో ఇస్తున్నారు.

– ముద్దాడ పాపారావు, రైతు, బొరిగివలస

### రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందుతున్న సేవలపై ఎప్పటికప్పుడు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఆధునిక సమాచారం అందిస్తున్నాం. అయితే ఆర్‌బీకేల పరిధిలో ఉన్న రైతులందరూ అన్ని సేవలు వినియోగించుకోవడం లేదు. ప్రతిరైతూ వచ్చి ఆర్‌బీకే సేవలను వినియోగించుకోవాలి. ఎరువులు, విత్తనాలు అందిస్తున్నాం. ఈ-క్రాప్ బుకింగ్ ప్రతిరైతూ.. అన్ని సీజన్లలోనూ చేసుకోవాలి.

– కె.సునీత, ఏఓ, నరసన్నపేట

# పేదలకు అండగా సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- కల్లటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

హిరమండలం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు అండగా నిలుస్తున్నాయని పాతటప్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని కల్లట సచివాలయం పరిధిలోని కల్లటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆదివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ ఈ నాలుగేళ్లలో అమలుచేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం లక్ష్యమన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సంక్షేమ పాలనపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పాలన కోసం రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరళా సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీసాల వెంకట రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్, సర్పంచ్ లావేటి లీలావతి, ఉప సర్పంచ్ గిరిడి లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు మీసాల రామారావు, బలగ నాగు, బత్తుల అప్పారావు, వి.చిరంజీవి, సీహెచ్ రామకృష్ణ, జి.సుదీర్, తొనంగి తౌడు, కె.మాధవరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అందుబాటులో ఎరువులు

కొత్తూరు: రైతులకు అందుబాటలో యూరియా, డీఏపీతోపాటు పలు రకాల ఎరువులు మండల కేంద్రంలోని పీఏసీఎస్ వద్ద అందుబాటులో ఉన్నట్లు సంఘం అధ్యక్షుడు చింతాడ సూర్యనారాయణ ఆదివారం తెలిపారు. ప్రస్తుతం 40 మెట్రిక్ టన్నులు యూరియాతోపాటు డీఏపీ ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్ని ఆర్‌బీకేలకు ఎరువులు కేటాయించినట్లు చెప్పారు. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా రైతులు ఎరువుల కోసం ఇబ్బంది పడకూడదన్న ఆలోచనతో ముందస్తుగా ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. ఖరీఫ్ పనులు మొదలు కావడంతో ఎరువులు కొరత రాకుండా పీఏసీఎస్ ద్వారా అసరమైన ఎరువులు రైతులకు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతి చొరవతో వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా రైతులకు ట్రాక్టర్లు అందజేసినట్లు చెప్పారు. రైతులకు పెట్టుబడి సాయం కింద సీఎం జగన్‌మోహన్ రెడ్డి రైతు భరోసా పథకం అమలు చేస్తూ అన్ని విధాలుగా ఆదుకుంటున్నారన్నారు. ఇప్పటికే ఆర్‌బీకేల ద్వారా రైతులకు ఇంటి వద్దకే నాణ్యమైన వరి విత్తనాలు పంపిణీ చేశామన్నారు.

### చట్టాలు నిర్వీర్యం



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధానకార్యదర్శి శేఖర్

పాతపట్నం: చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ ఆరోపించారు. స్థానిక అమ్మవారి ఆలయం సమీపంలోని సప్తగిరి కల్యాణ మండపంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం 20వ మహాసభలు జిల్లా అధ్యక్షుడు బొయిన అప్పలనాయుడు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 15 నుంచి 17వ తేదీ వరకు బాపట్లలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట 22వ మహాసభలు జరుగుతాయన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు చాపర సుందర్‌లాల్ మాట్లాడుతూ మహాసభల్లో తీర్మానాలను, నూతన కౌన్సిల్, కమిటీలను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా కార్యదర్శి ఎల్.వెంకటరావు, చాపర వెంకటరమణ, వాసుదేవరావు పాల్గొన్నారు.

### మురుగునీరు తొలగించండి



పాఠశాల పక్కన నిల్వ ఉన్న చెత్తాచెదారం

మెళియాపుట్టి: మండలంలోని చాపర గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీకి ఆనుకుని విపరీతంగా మురుగునీరు చేరి దుర్గంధం వెదజల్లుతోందని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు అన్నారు. అంతేకాకుండా తరగతి గదుల పక్కనే పంది చనిపోవడంతో విపరీతమైన దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రహరీ ఖాళీల నుంచి పాఠశాలలోకి మురుగునీరు వస్తుండటంలో కంపుకొడుతోంది. దీనిపై సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరారు. అదే విధంగా కొద్దిరోజులుగా ఎస్సీ, బీసీ కాలనీల్లో విద్యుత్ దీపాలు వెలగడంలేదనీ, విద్యుత్ శాఖ అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు.

# తాగునీటి సమస్యకు పరిష్కారం

బూర్జ: మండలంలోని కాశపర్తి పంచాయతీ జి.కె.ఆర్. పురం (సుంకరిపేట), చలికం గ్రామాల్లో ఇంటింటికీ కుళాయిల నిమిత్తం సర్పంచ్ బి.వి.నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం బోర్లు తవ్వారు. స్పీకర్ తమ్మినేని సీతారాం కృషి మేరకు ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారమైందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జి.కె.ఆర్.పురంలో బోరు తవ్విస్తున్న సర్పంచ్ బి.వి.నాయుడు



# గురువు దైవంతో సమానం



మాట్లాడుతున్న విజయనగరం విభాగ్ ప్రచారక్ రాజశేఖర్

కొత్తూరు: మన సంస్కృతిలో గురువు దైవంతో సమానమని ఆర్‌ఎస్ఎస్ విజయనగరం విభాగ్ ప్రచారక్ రాజశేఖర్ అన్నారు. కొత్తూరులో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. రాజశేఖర్‌తోపాటు పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఖండ ప్రచారక్ రాము, పోలినాయుడు మాట్లాడుతూ.. మన సనాతన ధర్మంలో గురువుకు విశేష ప్రధాన్యత ఉందన్నారు. దేశ వైభవానికి ప్రతీ పౌరుడు కృషిచేయాలని కోరారు. 1925లో స్థాపించిన ఆర్ఎస్ఎస్‌లో స్వయం సేవక్‌లు చేరి దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఎందరో మహానుభావులు ఉన్నారని గుర్తుచేశారు. కొత్తూరు, సీతంపేట, భామిని మండలాలకు చెందిన స్వయం సేవక్‌లు పాల్గొన్నారు.

### దంత వైద్యుడిగా సత్యసాయి

సారవకోట: మండలంలోని బుడితి సీహెచ్‌సీ దంత వైద్యుడిగా సత్యసాయి నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన డెంటల్ వైద్యుడు లీలాకుమార్ కొత్తూరు బదిలీ అయ్యారు. పొందురూ నుంచి సత్యసాయి బదిలీపై బుడితి సీహెచ్‌సీకి వచ్చారు.

### కేజీబీవీకి ఐదు టీవీలు మంజూరు



కేజీబీవీలో భద్రపరిచిన టీవీలు

సారవకోట: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు ఐదు టీవీలు మంజూరయ్యాయి. ప్రభుత్వం డిజిటల్ విద్యను ప్రవేశపెడుతుండటంతో బైజూస్ సంస్థ ద్వారా పాఠ్యంశాలను బోధించేందుకు వీటిని మంజూరు చేశారు. ఐదు తరగతి గదుల్లో వీటిని ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఒక్కొక్క టీవీ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని తెలుస్తోంది.

## విశ్వబ్రాహ్మణ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా విశ్వేశ్వరరావు



నూతన కార్యవర్గ సభ్యులతో అధ్యక్షుడు విశ్వేశ్వరరావు

ఆమదాలవలస: మండలంలోని విశ్వబ్రాహ్మణ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా లోలుగు విశ్వేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. స్థానిక మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ సన్నిధిలో మండల విశ్వబ్రాహ్మణ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఏర్పాటు చేసేందుకు ఆదివారం సమావేశం నిర్వహించారు. వైస్ ప్రెసిడెంట్లుగా కటకం పూర్ణచంద్రరావు, నల్లబాటి రాజశేఖర్, జనరల్ సెక్రటరీగా దుప్పలపూడి శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా మండ వెంకటరమణమూర్తి, ట్రెజరర్‌గా కటకం హరిప్రసాద్, అసిస్టెంట్ ట్రెజరర్‌గా టీకే గోపాలకృష్ణ, కన్వీనర్‌గా తాలాబత్తుల ధనుంజయరావు, సహాయ కన్వీనర్‌గా నిమ్మగడ్డ రామనాగ్‌ను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కుప్పిలి చంద్రమౌళి, మండా రాజేశ్వరరావు, ఒమ్మి భాస్కరరావు, ప్రత్యేక సలహాదారుడిగా కటకం నాగేశ్వరరావును ఎన్నుకున్నట్లు తెలిపారు. విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా పనిచేస్తామన్నారు.

## నేడు చెల్లాయివలసలో గడపగడపకు మన ప్రభుత్వం

పోలాకి: మండలంలోని చెల్లాయివలస గ్రామ సచివాలయ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సోమవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు స్థానిక సర్పంచ్ చింతు జగ్గునాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

డీసీసీబీ ఛైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపీపీ ముద్దాడ దమయంతి, తదితరులు హాజరవుతారాన్నరు. అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొనాలని కోరారు.

# షట్టర్ల ఏర్పాటు



షట్టర్ల పనులు పర్యవేక్షిస్తున్న సత్యనారాయణ

సరుబుజ్జిలి: రైతులకు కావాల్సిన అన్ని సదుపాయాల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ తెలిపారు. ఏళ్ల తరబడి యరగాం–పురుషోత్తపురం ఓపెన్ హెడ్ చానల్‌కు పురుషోత్తపురం వద్ద పడుతున్న ఇబ్బందులు రైతులు ఆయన దృష్టికి తెచ్చారు. వెంటనే శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరుచేయించారు. ఈ మేరకు ఆదివారం షట్టర్లు పనులు ప్రారంభించారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేసారు. ఉప సర్పంచ్ పైడి నర్సింహప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కిల్లి రామ్మోహనరావు, ఓపెన్‌హెడ్ చానల్ ఇంజినీర్లు, రైతులు పాల్గొన్నారు.

## సీఎం జగన్ పేరిట ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: మండల కేంద్రంలోని నీలమణిదుర్గ ఆలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరిట పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసోత్సవాల్లో భాగంగా అమ్మవారిని ఆదివారం శాకంబరీదేవిగా కూరగాయలతో ప్రత్యేక ఆలంకరించారు. అమ్మవారిని ఎమ్మెల్యే దర్శించుకుని పూజలు చేశారు. సీఎం జగన్ ఆయురారోగ్యాలతో ఉండాలని పూజలు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, సుదర్శనరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.